ప్రజాశక్తి


ఆదివారం 11 ఆగస్టు 2024

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి







- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై టిడిపిలో చర్చ
- పోటీపై ఏకాభిప్రాయానికి రాలేని కమిటీ
- నేడు మరోసారి సమావేశం

ఏం చేద్దాం..?

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పోటీపై టిడిపిలో సందిగ్ధత కొనసాగుతోంది. గెలవడానికి సరిపడినంతమంది స్థానిక సంస్థల ఓటర్లు కూటమికి లేకపోవడంతో పోటీ చేసి ఓటమిపాలయ్యాకంటే పోటీ చేయకపోవడమే మంచిదన్న అభిప్రాయంతో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఉన్నట్లు తెలిసింది. ఉమ్మడి విశాఖపట్నానికి చెందిన కూటమి ఎమ్మెల్యేలు కొంతమంది తమ అభ్యర్థిని గెలిపించుకుంటామని విశ్వాసంతో చెప్పినప్పటికీ చంద్రబాబు మాత్రం అభ్యర్థిని పెట్టడానికి సానుకూలంగా లేనట్లు తెలిసింది. తమ పార్టీ అభ్యర్థి గెలవడానికి తగిన సంఖ్యాబలం లేనప్పుడు పోటీచేసి ఓటమిపాలైతే అప్రతిష్టపాలవుతామన్న ఆలోచనలో ఆయన ఉన్నట్లు సమాచారం.

కూటమి తరపున టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థిని బరిలో పెట్టాలని కొంతమంది ఎమ్మెల్యేలు పట్టుబట్టడంతో వాస్తవ పరిస్థితిని మదించి నివేదిక సమర్పించాలని చంద్రబాబు ఆరుగురితో ఓ కమిటీని నియమించిన సంగతి తెలిసిందే.

రెండ్రోజుల్లో నివేదిక ఇవ్వాలని కమిటీకి సూచించినా.. ఆ కమిటీ సభ్యులు పోటీపై ఏకాభిప్రాయానికి రాలేకపోతున్నారు. తగిన సంఖ్య లేనప్పుడు పోటీ చేయకపోవడమే ఉత్తమమని కొంతమంది, పోటీచేస్తే తమ అభ్యర్థిని బలపర్చే స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు చాలా మంది ఉన్నారని మరికొంతమంది ఎమ్మెల్యేలు చెప్పుకొచ్చారు. కమిటీ సభ్యుల మధ్య స్పష్టత లేకపోవడంతో ఊహలతో కాకుండా వాస్తవ పరిస్థితులను చంద్రబాబుకు నివేదించేందుకు ఆదివారం కూర్చొని చర్చించాలని వారంతా అనుకున్నారు. ప్రస్తుతం 838 మంది స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల్లో వైసిపికి చెందిన 600 మందిలో పది మంది కూడా కొత్తగా బహిరంగ మద్దతు తెలిపినవారుగానీ, కూటమి పార్టీలో చేరినవారుగానీ లేనప్పుడు గెలుస్తామని చెప్పడం సరికాదన్న అభిప్రాయంతో కమిటీ సభ్యుల్లో కొంతమంది ఉన్నారు. పోటీ చేయడానికి కుతూహలం చూపుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, గండి బాబ్జి, పివిజి.కుమార్, బత్తుల తాతయ్యబాబు, బైరా దిలీప్ చక్రవర్తిల్లో ఎవరూ పది కోట్లకు మించి ఖర్చు చేయడానికి సుముఖత చూపడంలేదని తెలిసింది. ఎవరు పోటీ చేసినా రూ.40 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. బలం లేకపోవడం, డబ్బు ఖర్చుకు అభ్యర్థులు వెనుకాడ్డంతో పోటీకి దూరంగా వుండడం మంచిదని చంద్రబాబు అన్నట్లు తెలిసింది.



ర్యాలీలో పాల్గొన్న విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్

డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండండి

మత్తు బారిన పడితే జీవితం అంధకారం

నషా ముక్త్ భారత్ అభియాన్ ర్యాలీలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగానికి, చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని, బంగారు భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, దుష్ప్రభావాలపై అవగాహన కల్పించి ప్రజలను వాటికి దూరంగా ఉంచాలనే లక్ష్యంతో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన చేపట్టిన నషా ముక్త్ భారత్ అభియాన్ ర్యాలీని శనివారం ఉదయం ఆర్‌కె.బీచ్ రోడ్డులో సిటీ పోలీస్ కమిషనర్ బాగ్చీతో కలిసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు, వివిధ విభాగాల అధికారులతో కలిసి ర్యాలీలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెమోగ్రాఫిక్ డివిడెండ్ అనే కాన్సెప్ట్‌పై వ్యసనాల ప్రభావం తీవ్రంగా పడుతుందని పేర్కొన్నారు. గంజాయి మహమ్మారి చాలా సమస్యలకు మూలకారణమన్నారు. మత్తు పదార్థాల దుష్ప్రభావాల బారి నుంచి బయట పడేందుకు అందరూ మిగతా 2లో..

ఎవరెన్ని కుట్రలు చేసినా వైసిపిదే విజయం

వార్త 2లో..

విశాఖ - ఎస్ఎంవి బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లు

వార్త 2లో..

స్కూల్ బస్ ఢీకొని బాలిక దుర్మరణం

వార్త 3లో..



అనకాపల్లిలో స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ఘనంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవం

పలుచోట్ల పతాకావిష్కరణలు

వార్తలు 8లో..

క్షీణిస్తున్న శాంతి భద్రతలు

- నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న దొంగతనాలు, ఘర్షణలు, హత్యలు
- పోలీసు యంత్రాంగం తీరుపై విమర్శలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నిఘా నిద్రపోతోందా ? ప్రశాంత విశాఖలో శాంతి కరువై...భద్రత గాలిలో దీపమైందా? అంటే అవుననే సమాధానమే పెక్కు మంది నుంచి వినిపిస్తోంది. డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ చెకింగ్ పనులకే పోలీసులు పరిమితమై శాంతి భద్రతలను గాలి కొదిలేశారన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. చీకటి పడితే నగరంలోని కొంతమంది ఖాకీలు ఎండాడ, రుషికొండ సహా పలు ప్రాంతాల్లో బడ్డీల వెనక్కు చేరి మద్యం తాగే వారి నుంచి రెండు చేతులా వసూళ్లు చేసుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారన్న ఆరోపణలు ఎక్కువ వుతున్నాయి. లా అండ్ ఆర్డర్ విషయం అస్సలు వారికి పట్టడం లేదని జనం అంటున్నారు. దీంతో కన్ను మూసి కన్ను తెరిచేలోగా ఒక నేరం..మరో ఘోరం.. ఓ చోట కొట్లాట...ఇంకోచోట హత్య అన్నట్టు విశాఖలో పరిస్థితి మిగతా 2లో..



ఎన్ఎడి జంక్షన్‌కు సమీపంలో గ్రూపులుగా విడిపోయి కొట్టుకుంటున్న విద్యార్థులు (ఫైల్‌ఫొటో)

మొదటి పేజీ తరువాయి..

క్షీణిస్తున్న శాంతి భద్రతలు

మారిపోయింది. రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందినవారే అయినా దుర్ఘటనల నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ ఏమీ వహించడం లేదని పలువురు అంటున్నారు.

కాలేజీల్లో 1990ల నాటి గ్యాంగ్‌ల సంస్కృతి విశాఖ నగరంలో కనిపిస్తోంది. మూడు రోజుల క్రితం ఎన్ఏడి జంక్షన్ వద్ద కాలేజీ విద్యార్థులు సీనియర్, జూనియర్లుగా విడిపోయి బాహాటంగా కొట్టుకున్నారు. పోలీసులొచ్చినా వారు బెదరలేదు. పరిస్థితి అదుపులోకి రాలేదు. శుక్రవారం సీతంపేట పరిధిలోని కృష్ణాలయం వద్ద యువకులు కొట్టుకున్నారు. ఇక్కడ కూడా ఇదే స్థితి కనిపిస్తోంది. మధురవాడ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీ భవంతులైన పనోరమ హిల్స్‌లో శుక్రవారం జరిగిన భారీ చోరీ కలకలం రేకెత్తిస్తోంది. రూ.కోట్ల విలువైన ఆస్తిని నివాసితులు నష్టపోవాల్సి వచ్చింది. భారీ భద్రత కలిగిన పనోరమ హిల్స్ ఇళ్లలోనే ఇలా జరగడంపై ప్రజల్లో చర్చసాగుతోంది. ఇక వన్‌టౌన్, గాజువాక ప్రాంతాల్లో ఇటీవల హత్యలు పెరిగాయి. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఖాకీలు తమ విధులపై అప్రమత్తంగా లేకపోతే అనర్థాలు తప్పవన్న హెచ్చరికలు, సంకేతాలు ఇప్పటికే అనేక ఘటనల ద్వారా రూఢీ అయ్యింది.

డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండండి

డి అడిక్షన్ సెంటర్ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. కళాశాల, యునివర్సిటీ విద్యార్థులు క్యాంపస్ అంబాసిడర్లుగా తయారవ్వాలని.. తోటి యువతలో మార్పు తీసుకురావాలని హితవు పలికారు. గంజాయిలాంటి మహమ్మారిని తరిమికొట్టేందుకు అన్ని రకాల చర్యలూ చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. గంజాయి సరఫరా, రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి అరికట్టాలన్నారు. సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ నషా అంటే కేవలం గంజాయి వినియోగం మాత్రమే కాదని, అన్ని రకాల మత్తు పదార్థాలు, వ్యసనాలూ అని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా నేడు జాతీయ సమస్యగా మారిందని.. దీన్ని అరికట్టేందుకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఫ్యాషన్‌గా భావించి యువత మత్తులోకి దిగవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ డిడి.రామారావు, బిసి సంక్షేమ శాఖ అధికారిణి శ్రీదేవి, విద్య, న్యాయ, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ - ఎస్ఎంవి బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల రద్దీ, ప్రజల అవసరాలరీత్యా ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం - ఎస్ఎంవి బెంగళూరు మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్ల సేవలను పొడిగించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 08543 విశాఖపట్నం - ఎస్ఎంవి బెంగుళూరు వీక్లీ స్పెషల్ రైలు ఆగస్టు 18 నుంచి నవంబర్ 24 వరకు ప్రతి ఆదివారం మధ్యాహ్నం 15:55 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.30కి ఎస్ఎంవి బెంగళూరు చేరుకుంటుంది. 08544 ఎస్ఎంవి బెంగళూరు - విశాఖపట్నం వీక్లీ స్పెషల్ ఆగస్టు 19 నుంచి నవంబర్ 25 వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 15.50 గంటలకు ఎస్ఎంవి బెంగుళూరులో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 13.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట్, బెంగళూరు సెంట్రల్ మీదుగా ప్రయణిస్తాయని, ప్రజలందరూ ఈ సేవలను వినియోగించుకోవాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

పలు రైళ్లు రీ షెడ్యూల్

వాల్తేరు రైల్వే డివిజన్‌లోని పలాస-పుండి-నౌపడ-విజయనగరం సెక్షన్‌లో ఆధునికీకరణ పనుల దృష్ట్యా ఆగస్టు 12, 15, 17 తేదీల్లో పలు రైళ్ల రాకపోకల విషయంలో మార్పులు చోటుచేసుకున్నట్టు ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు 12830 భువనేశ్వర్ - ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 15న నిర్ణీత సమయం 12:10 గంటలకు బదులు గంట ఆలస్యంగా 13.10 గంటలకు బయలుదేరేలా రీషెడ్యూల్ చేశారు. 22974 పూరీ - గాంధీధామ్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 17న నిర్ణీత సమయం 11:15 గంటలకు బదులు 1.30 గంటలు ఆలస్యంగా 12:45 గంటలకు బయలుదేరుతుంది. 22879 భువనేశ్వర్ - తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 17న నిర్ణీత సమయం 12:10 గంటలకు బదులు గంట ఆలస్యంగా 13.10 గంటలకు బయలుదేరుతుంది. 07470 విశాఖపట్నం - పలాస మెము ఆగస్టు 12, 15, 17 తేదీలలో శ్రీకాకుళం రోడ్డులో షార్ట్ టర్మినేట్ అవుతుంది. కావున 07471 పలాస - విశాఖపట్నం మెము ఆయా తేదీల్లో పలాసకు బదులుగా శ్రీకాకుళం రోడ్డు నుంచి బయలుదేరుతుంది.

రమణమూర్తికి అభినందనలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి అదనపు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన డి.వి.రమణమూర్తిని ఎస్‌సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.సత్య పద్మ మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. నూతన బాధ్యతల స్వీకరణను పురస్కరించుకుని అభినందనలు తెలిపారు.



రమణమూర్తికి అభినందనలు తెలుపుతున్న సత్యపద్మ

విలువల రాహిత్యానికి పరాకాష్ట

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాలు, రైల్వే ప్రమాదాల్లో ప్రజాస్వామిక విలువల రాహిత్యం, ప్రభుత్వ బాధ్యతారాహిత్యం కొట్టిచ్చినట్లు కనబడుతోంది. గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థలో టిడిపికి చెందిన పది మంది స్థాయీ సంఘ సభ్యులుగా గెలిచారన్న సంతోషం ఆ పార్టీలో వుండొచ్చు, ఓటమిపాలయ్యామన్న బాధ వైసిపిలో కనబడొచ్చుగానీ అంతిమంగా ప్రజలకు కలిగే ప్రయోజనాలేంటని ప్రశ్నిస్తే సమాధానం దొరకడంలేదు. ఎన్నికల్లో విజయాన్ని చూసి మురిసిపోతే సరిపోదు. ఆ విజయం వెనుక జరిగిన మంచి, చెడులను పరిశీలిస్తే ప్రజలకు కలిగే కీడు, మేలు అర్థమవుతుంది. గతంలో వైసిపి స్థానిక ఆధిపత్యం ఇప్పుడు కూటమి చేతిలోకి వెళ్లింది. ఇందులో పవర్ గేమ్, మనీ గేమ్ తప్ప పబ్లిక్ ఇంట్రస్టులేమీ లేవు. తమ చేతిలో వున్న అధికారంతో నాలుగు పైసలు వెనకేసుకోవడానికి చేస్తున్న గారడీలే ఇవన్నీ. పార్టీలు మారడం నుంచి, గెలవడానికి నిర్వహించే క్యాంపు రాజకీయాల వరకు మధ్యలో ఆడుతున్నదీ, ఆడిస్తున్నదీ డబ్బు తప్ప ఏముంది ?

జేబులు నింపుకొనే అవకాశం వైసిపి నుంచి కూటమి సభ్యులకు వచ్చింది తప్ప పరిపాలనలో ప్రజారంజక నిర్ణయాలేమీ జరుగుతాయని ఆశించలేం. నగరంలోని నిర్మాణరంగ వ్యాపారుల్లో అగ్రగణ్యుడిగా గుర్తింపుపొందిన వైసిపి మాజీ ఎంపీ ఎంవివి సత్యనారాయణ గుట్టురట్టు చేయడానికి, తమ అధికారిక పలుకుబడితో నామినేషన్ పనులు చేసుకోవడానికి, కావాల్సిన వారి నిర్మాణాలకు



అనుమతులు ఇప్పించుకోవడానికి పదవులు దోహదపడనున్నాయి. నగర పాలక స్థాయీ ఎన్నికల క్యాంపు రాజకీయాలు నడుస్తుండగానే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓటర్లతో శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఎన్నికల్లో విలువల రాహిత్యం ఇలావుంటే, విశాఖ రైల్వే స్టేషన్‌లోని కోర్బా రైలు ఎసి భోగిలో వ్యాపించిన మంటలు కేంద్ర ప్రభుత్వ బాధ్యతా రాహిత్యాన్ని గుర్తుకుతెస్తున్నాయి. పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో అందుబాటులోవున్న రైల్వేను దెబ్బతీయాలని మోడీ ప్రభుత్వం ఎంతోకాలంగా ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే రైల్వేను బలోపేతం చేయకుండా ఉద్దేశపూర్వకంగా బలహీనపర్చాలని చూస్తోంది. శాశ్వత ఉద్యోగులు చేయాల్సిన పనులను అవుట్ సోర్సింగ్‌కు అప్పగించి ప్రయివేటు వ్యక్తులు డబ్బులు పోగేసుకొనే పనిచేస్తోంది. వివిధ చోట్ల జరిగిన రైల్వే ప్రమాదాలకు కనిపించిన ప్రభుత్వ వైఫల్య, నిర్లక్ష్యాలే కోర్బా రైలు భోగిలో మంటల వ్యాప్తిలో పునరావృతమయ్యాయి. శాశ్వత రైల్వే ఉద్యోగులు చేయాల్సిన ఎసిలు, శానిటరీ, ఎలక్ట్రికల్ నిర్వహణ పనులను అవుట్ సోర్సింగ్‌కు రైల్వే అప్పజెప్పింది. కాంట్రాక్టర్ ఆ నిర్వహణ పనులు సరిగా చేయకపోవడంతో ఈ ప్రమాదానికి దారితీసినట్లు ప్రాథమిక నిర్ధారణకు రైల్వే అధికారులొచ్చారు. ఇప్పటికైనా ప్రమాద మూలాలను గుర్తించి రైల్వేను పటిష్టపరచాలి. అన్ని స్థాయిల ఉద్యోగులను శాశ్వత ప్రాతిపదికన నియమించి ప్రమాదాలను నివారించే బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలి.

ఎవరెన్ని కుట్రలు చేసినా వైసిపిదే విజయం

మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ



కార్పొరేటర్లు, సీనియర్ నేతలతో సమావేశమైన బొత్స

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎవరెన్ని కుట్రలు చేసినప్పటికీ ఈ నెల 30న జరగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తాను భారీ ఆధిక్యతతో విజయం సాధించడం తథ్యమని, ఆ విషయంలో జివిఎంసిలోని వైసిపి కార్పొరేటర్లకు సందేహం అక్కరలేదని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. శనివారం మేఘాలయ హోటల్లో వైసిపి కార్పొరేటర్లతో ఏర్పాటుచేసిన అంతర్గత సమావేశంలో ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఈ నెల 13తో ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణ గడువు ముగుస్తుందని, దానికి ఒక రోజు ముందుగానే సోమవారం తాను నామినేషన్ దాఖలు చేస్తానని, దానికి కార్పొరేటర్లు అందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్లు అందరూ సహకరించాలని కోరారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం కార్పొరేటర్లతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైసిపికి తగినంత సంఖ్యా బలం ఉన్నప్పటికీ, తమతో పోటీకి రావడంలోగల ఆంతర్యం ఏమిటని పరోక్షంగా కూటమి నాయకులను ప్రశ్నించారు. ఎవరు ఎవరి కోసం గేట్లు తెరిచారో 2019 ఎన్నికలలో తాము చూసామన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినప్పటికీ వైసిపి విజయం ఖాయమన్నారు. బొత్స సత్యనారాయణ స్థానికేతరుడు అంటున్నారని, మరి అనకాపల్లిలో ఎంపీగా నెగ్గిన సిఎం రమేష్ ఎక్కడి వారని ప్రశ్నించారు.

కార్పొరేటర్లపై బొత్స ఆగ్రహం

ఇదిలా ఉండగా సమావేశంలో పాల్గొన్న కొందరు వైసిపి కార్పొరేటర్లపై మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తపరిచినట్లు తెలిసింది. ప్రధానంగా జివిఎంసిలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత నలుగురు కార్పొరేటర్లు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరించారని అన్నారు. అయితే వారి పేర్లు ప్రస్తావించకుండా తీవ్రస్థాయిలో వారిపై బొత్స ధ్వజమెత్తినట్లు తెలిసింది. స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికల సమయంలో పార్టీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డిని కలిసిన 40 మందికిపైగా కార్పొరేటర్లలో సుమారు 15 మంది ఎన్నికలలో స్వపార్టీకి బదులు వేరే పార్టీ వారికి ఓట్లు వేశారని, వారు ఆ విధంగా వ్యవహరించడానికి ఈ నలుగురు నాయకుల పనితీరే కారణమని ఆయన వ్యాఖ్యానించినట్లు పలువురు తెలిపారు.

ఉక్కునగరం స్టేషన్‌ను సందర్శించిన సిపి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ పోలీసుస్టేషన్‌ను నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో సిబ్బంది ప్రవర్తిస్తున్న తీరు, వచ్చిన ఫిర్యాదులపై పరిష్కరిస్తున్న తీరును పరిశీలించారు, అనంతరం స్టేషన్ మొత్తం నిశితంగా పరిశీలించారు. స్టేషన్‌ను ఆనుకొని ఉన్న ఖాళీ ప్రాంతాలను వ్యర్థాలతో నింపకుండా, శుభ్రం చేయించి మొక్కలు నాటాలని ఆదేశించారు. స్టేషన్ లోపల మొత్తం పరిశీలించారు. స్టేషన్‌తో పాటుగా మరుగుదొడ్లను ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు, స్టేషన్‌లో ఎల్లవేళలా తగు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. పెండింగ్ కేసులు తక్షణం పరిష్కరించాలన్నారు. అన్ని రిజిస్టర్లు ఎల్లవేళలా అప్‌డేట్‌గా ఉండాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులకు మర్యాద ఇస్తూ వారిని కూర్చోబెట్టి సమస్యలను వినాలని, వాటిని పారదర్శకముగా విచారణ చేసి త్వరితగతిన పరిష్కారించాలని చెప్పారు. క్రైమ్ పోలీస్ స్టేషన్ అవరణలో ఉన్న సీజ్ చేయబడిన, వినియోగంలో లేని వాహనాలు పాడవకుండా తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

స్టేషన్ పరిధిలోని అన్ని సెక్టర్లలో ఎటువంటి దొంగతనాలు, అసాంఘిక చర్యలూ జరగకుండా క్రైమ్ పోలీసులు పోలీసింగ్ చేయాలని, సీసీటీవీ కెమెరాలు మరిన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల ప్రతి కదలికనూ ఎల్లవేళలా పరిశీలించాలనీ, గంజాయి రవాణాదారులను అరెస్టు చేయాలనీ, స్టేషన్ల పరిధిలో ఒక్క గంజాయి పెడ్లర్ కూడా ఉండరాదని స్పష్టమైన అదేశాలు జారీ చేశారు. విధులలో ఎటువంటి అధికార దుర్వినియోగానికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ, సమస్యలు ఏమైనా ఉంటే చెప్పమని అడిగారు. సిబ్బంది తెలిపిన కొన్ని సమస్యలపై తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సిబ్బందికి కుటుంబం, ఉద్యోగ పరముగా, ఇతర ఏ సమస్యలున్నా 7995095799 నెంబరుకు తెలియపరచాలని సూచించారు.



ఉక్కునగరం స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

దౌర్జన్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ ఆర్‌టిఒ కార్యాలయం ఎదురు స్థలములో ఉన్న వాచ్‌మ్యాన్‌పై దౌర్జన్యం చేసిన వ్యక్తులపై శనివారం స్థానిక పోలీసులకు స్థల యజమాని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలావున్నాయి.. ఆనందపురం గ్రామ పంచాయతీకి చెందిన కుంచం వాసుకు గంభీరం సర్వే నెంబరు 175/2 వారసత్వంగా వచ్చిన స్థలం ఉంది. ఈ స్థలంలో ఎడ్ల అప్పలరాజును వాచ్‌మ్యాన్‌గా ఉన్నాడు. శనివారం గంభీరం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తన అనుచరులతో స్థలంలోకి వచ్చి వాచ్‌మ్యాన్‌ను దుర్భాషలాడి ఈ స్థలం తమ వారిదని, ఇక్కడ ఉంటే చంపుతామని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన తాత కుంచం ఆంజనేయులు వారసత్వంగా వస్తున్న 72 సెంట్లు భూమిలో బడా బాబులు కన్ను పడిందని, ఈ స్థలాన్ని కాజేయడానికి తమ వాళ్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని కుంచం వాసు ఆరోపించారు. రాజకీయ పలుకుబడితో తమను బెదిరిస్తున్నారని, తమకు వారి వల్ల ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. తమను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

వెలగని వీధిదీపాలు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 6వ వార్డు పరిధి బక్కన్నపాలెంలో గత కొంత కాలంగా విధిదీపాలు వెలగడం లేదు. దీనిపై గ్రామానికి చెందిన పోతిన అప్పలరాజు సంబంధిత అధికారులు ఫిర్యాదు చేశారు. అనలైన్‌లో కూడా ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విధిదీపాలకు మరమ్మతులు చేపట్టి గ్రామంలో వెలుగులు నింపాలని ఆయన కోరుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయానికి స్మార్ట్ మీటర్

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో తొలి స్మార్ట్ మీటర్‌ను విశాఖపట్నం జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్/పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ కార్యాలయానికి ఏపీఈపీడీసీఎల్ అధికారులు అమర్చారు.



స్మార్ట్ మీటర్‌ను బిగిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

సెమిస్టర్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



నమ్మి హరిప్రియను అంభినందిస్తున్న చైర్మన్ నరసింగరావు

ప్రజాశక్తి -తగరపువలస :

శ్రీ కృష్ణా డిగ్రీ కళాశాల

ఆంధ్రా యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ సెకండియర్ నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు స్థానిక శ్రీ కృష్ణా డిగ్రీ కళాశాల చైర్మన్ బి.నరసింగరావు శనివారం తెలిపారు. బిఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో నమ్మి హరిప్రియ 10 పాయింట్లుకు గాను 9.87, దుంప దీపిక 9.70 పాయింట్లను సాధించి మండలంలోనే ప్రథమ స్థానం సాధించారని పేర్కొన్నారు. వీరే గాకుండా 9 పాయింట్లకు పైగా 15 మంది, 8 పాయింట్లకు పైగా 50 మంది ఉత్తీర్ణత సాధించారని వివరించారు. ఎయు పరిధిలో తమ కళాశాల విద్యార్థులు 99 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. వీరిని కళాశాలలో చైర్మన్ నరసింగరావుతో పాటు ప్రిన్సిపల్ జె.సతీష్‌కుమార్, పలువురు అధ్యాపకులు అభినందించారు

బాసర డిగ్రీ కళాశాలలో...

ఆంధ్రాయూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారని స్థానిక శ్రీ బాసర డిగ్రీ కళాశాల చైర్మన్ పూడి రమేష్ తెలిపారు. బిఎస్సీ (ఎంపిసిఎస్)లో ఎం.శ్రావణి 10 పాయింట్లకు 10 సాధించి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించగా, ఎస్‌కె రహిదాబీబీ 9.73 పాయింట్లతో ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 20 మంది విద్యార్థులు 9 పాయింట్ల కంటే ఎక్కువ సాధించారని పేర్కొన్నారు. వీరందరినీ కళాశాలలో చైర్మన్ రమేష్‌తో పాటు ప్రిన్సిపల్ సిహెచ్.సురేష్, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఎఒ కేశవ్, భాస్కరరావు అభినందించారు



విద్యార్థిని శ్రావణిని అభినందిస్తున్న చైర్మన్ రమేష్ తదితరులు

తీరంపై మత్స్యకారులకు పూర్తి హక్కులు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న గంటా నూకరాజు

ప్రజాశక్తి -భీమునిపట్నం : తీరంపై మత్స్యకారులకు పూర్తి హక్కులున్నాయని జివిఎంసి మూడో వార్డు పరిధి ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు గంటా నూకరాజు పేర్కొన్నారు. శనివారం బీ.వి.ఎం.లిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్థానిక ఎస్ఒఎస్ చిల్డ్రెన్స్ విలేజ్ ఎదురుగా బీచ్ రోడ్డులో ఓ హోటల్ వెనుక ఉన్న స్థలం శ్మశాన వాటికగా వాడుకలో ఉందని, సంబంధిత స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయడంలో ఆంతర్యం ఏమిటని జివిఎంసి ఒకటో జోన్ అధికారులను ప్రశ్నించారు. తాత ముత్తాతల నుంచి మత్స్యకార సామాజిక తరగతికి చెందినదిగా సంబంధిత శ్మశాన వాటిక ఉందని స్పష్టం చేశారు. హోటల్ యజమానికి లబ్ధి చేకూర్చాలన్న ఆలోచనతోనే శ్మశాన వాటిక స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారని ఆరోపించారు. తక్షణమే హెచ్చరిక బోర్డును తొలగించాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సంబంధిత సమస్యను స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

మొక్కలు నాటివేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక జమ్మి చెరువు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన శనివారం సంబంధిత పార్కులో క్లబ్ ప్రతినిధులు పలు రకాలకు చెందిన 52 మొక్కలు నాటారు. నాటిన మొక్కల్లో పండ్లు, పూలు, దేవతా మొక్కలు ఉన్నాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మి చెరువు వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఎన్.జనార్ధనరావు, గాడు సన్యాసినాయుడు, విఎస్.శంకర్ కుమార్, పి.కృష్ణవర్మ, డి.శేషాద్రి, డి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

స్కూల్ బస్ ఢీకొని బాలిక దుర్మరణం



రోధిస్తున్న తల్లి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఓ ప్రయివేట్ స్కూల్ బస్ ఢీ కొని మూడేళ్ల బాలిక దుర్మరణం పాలైంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మజ్జిపేటకు చెందిన మూడేళ్ల బాలిక ఆధ్య పద్మనాభం మండలం రెడ్డిపల్లి జంక్షన్ లో ఉన్న జ్ఞాన జ్యోతి పాఠశాలకు వెళ్లింది. తిరుగు ప్రయాణంలో ఆ స్కూల్ బస్సులో మజ్జిపేట వచ్చింది. మజ్జిపేట జంక్షన్ వద్ద కుమార్తె స్కూల్ నుంచి వస్తుందని తండ్రి సురేష్ వేచి చూస్తున్నాడు. బస్సు దిగుతూనే ఎదురుగా తండ్రిని చూసి “డాడీ” అంటూ కుమార్తె పరుగున వెళ్లింది. బాలిక దిగిపోవడంతో బస్సును డ్రైవర్ సూరిబాబు వెంటనే ముందుకు తీశాడు. పరుగున వెళ్తున్న బాలికను బస్సు ఢీ కొంది. వెంటనే బాలిక రోడ్డుపై పడి తీవ్ర గాయాలై అక్కడిక్కక్కడే దుర్మరణం చెందింది. బాలిక మృతితో తల్లి దండ్రులు తల్లడిల్లి పోయారు. వారిని ఓదార్చడం ఎవరివల్లా కాలేదు. భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య



హరిప్రసాద్ (ఫైల్)

ప్రజాశక్తి-సీతమ్మధార : ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధి సీతంపేటలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి ద్వారకా పోలీసుల కథనం ప్రకారం... సీతంపేట ప్రాంతంలో నివాసముంటున్న హరిప్రసాద్ మొదటి భార్య వరలక్ష్మికి విడాకులిచ్చి మరో వివాహిత భువనేశ్వరిని పెళ్లి చేసుకున్నాడు. హరిప్రసాద్ స్నేహితుడు పెంకి రాజేష్‌తో భువనేశ్వరి వివాహేతర సంబంధం పెట్టుకోవడాన్ని హరిప్రసాద్ చూసి తట్టుకోలేకపోయాడు. స్నేహితుడు రాజేష్, భార్య భువనేశ్వరి చేసిన మోసాన్ని వీడియో ద్వారా రికార్డు చేసి వాంగ్మూలం ఇచ్చి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మొదటి భార్యకు తనకు పుట్టిన బిడ్డను కాపాడాలని, తనకు అన్యాయం చేసిన వారిని శిక్షించాలని హరిప్రసాద్ వీడియో ద్వారా పోలీసులను కోరారు. తన మాజీ భర్త హరిప్రసాద్ ఆత్మహత్యకు రాజేషే కారణమని మొదటి భార్య వరలక్ష్మి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆత్మహత్య చేసుకోబోయే ముందు వీడియో ద్వారా మరణం వాంగ్మూలాన్ని తనకు పంపారని, హరిప్రసాద్‌కు జరిగిన అన్యాయానికి కారణమైనవారిని కఠినంగా శిక్షించాలి వరలక్ష్మి డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని ఎ.కోడూరు శివారు జంగం బంద చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఏ కోడూరు ఎస్సై జె.రమేష్ తెలిపారు. 35 నుండి 40 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న యువకుని శరీరం పూర్తిగా ఉబ్బి పోయి గుర్తు పట్టని విధంగా ఉందని పేర్కొన్నారు. తెలుపు నలుపు రంగుల అడ్డగీతలతో ఉన్న టీ షర్టు, జీన్ ప్యాంటు వేసుకున్నాడని, మృతదేహం ఆచూకీపై సంబంధిత వ్యక్తులు ఎ.కోడూరు పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన యువకుడు పాలూరి రామకోటేశ్వరరావు (25) విద్యుత్ షాక్ కు గురై మృతి చెందినట్లు ఎస్ఐ సన్నిబాబు వెల్లడించారు. రామకోటేశ్వరరావు శనివారం ఉదయం తమ ఇంటిపై వేలాడుతున్న చెట్ల కొమ్మలను తొలగించే క్రమంలో విద్యుత్ లైన్‌కు తగలడంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు డెక్కన్ కంపెనీలో పనిచేస్తున్నాడన్నారు. మృతుడు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

నక్కపల్లి: ఎన్.నరసాపురం గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ దాకారపు రాములు (45) ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కు గురై మృతి చెందినట్లు ఎస్ఐ సన్నిబాబు వెల్లడించారు. దాకారపు రాములు ఎలక్ట్రీషన్‌గా పనిచేసేవాడు. శనివారం ఉపమాక పంచాయతీ శివారు కొండవెనుక పాలెం గ్రామంలో గొర్ల తాతారావు నిర్మిస్తున్న నూతన గృహానికి వైరింగ్ చేసేందుకు వెళ్ళాడు వైరింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు రాములు విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో, వెంటనే ఆయన్ను నక్కపల్లి సిహెచ్‌సికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.



మాట్లాడుతున్న కరణం కనకారావు

ఎమ్మెల్యే పల్లాకు ధన్యవాదాలు

ప్రజాశక్తి -గాజువాక : ఎపి టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఓనర్స్ అసోసియేషన్‌కు స్థలం కేటాయిస్తానని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హామీ ఇవ్వడంతో ఆయనకు అసోసియేషన్ అధ్యక్షులు కరణం కనకారావు ధన్యవాదాలు తెలిపారు. గాజువాక ఆటోనగర్‌లో అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకారావు మాట్లాడుతూ, అసోసియేషన్ కోరిక మేరకు బిల్డింగ్ నిర్మాణానికి స్థలం కేటాయిస్తానని ఎమ్మెల్యే చెప్పడం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి చట్టి వెంకటరమణ, వైస్ ప్రెసిడెంట్ పాపారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సర్వసిద్ధి వరదేశ్, సహాయ కార్యదర్శి సిహెచ్.ప్రసాద్, బొండా అచ్చిబాబు, నందవరపు రమణ, ఎల్‌జి.శ్రీహరి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌లో చెస్ టోర్నమెంట్

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక లయన్స్ క్లబ్, ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ సంయుక్తంగా గాజువాక లయన్స్ క్లబ్ లో శనివారం అండర్ 13 ఓపెన్, గర్ల్స్ కేటగిరీలో డిస్ట్రిక్ట్ చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 200 మంది పిల్లలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ లయన్ సత్యాల కోటేశ్వరరావు, సెక్రటరీ పోలిశెట్టి లక్ష్మణ్, కోశాధికారి బలివాడ సత్యారావు, బోయిన బాబూరావు, పాల్గొన్నారు. అనంతరం లయన్ నున్న శ్రీనివాసరావు విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. గర్ల్స్ కేటగిరీలో మొదటి బహుమతి గొర్లె నైన, రెండవ బహుమతి లహరి, బాయ్స్ కేటగిరీలో మొదటి బహుమతి తనీష్, రెండవ బహుమతి వంశీ సాధించారు.

నాగమణి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి -పద్మనాభం : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భీమిలి నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నాగోత నాగమణి శనివారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో విశాఖపట్నంలో టిడిపిలో చేరారు. ఆమెకు పల్లా శ్రీనివాసరావు టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. శుక్రవారం నాగోతి నాగమణి అమరావతిలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి పార్టీలో చేర్చుకోవాలని కోరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో చేరాలని లోకేష్ సూచించడంతో విశాఖలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు.

జీవవైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి- ఆనందపురం: జీవవైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత అని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం అన్నారు. ఆనందపురం కస్తూరిబా గాంధీ బాలికల విద్యా సంస్థలో శనివారం పండ్ల జాతి మొక్కలు, కూరగాయల నారు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఔషధ గుణాలు కలిగిన మొక్కలు, పక్షులు గూళ్లు పెట్టుకునే మొక్కలు, దేశీయ కూరగాయలు, ఆకుకూరలు మొక్కలు నాటుదామని పిలుపునిచ్చారు. భవిష్యత్తు తరాల కోసం సామాజిక వనాలు పెంచుదామన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి ఆధారిత వ్యవసాయం ఎంతో అవసరం అన్నారు. అధ్యాపకులు సంధ్యారాణిసాదిని మాట్లాడుతూ తమ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నారన్నారు. మొక్కలతో తమ విద్యా సంస్థను నందన వనంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు టి.తారక, బి.స్వరాజ్యలక్ష్మి, శీలా, సరస్వతి, శ్రీలక్ష్మి, అనూరాధ, కుమారి, గ్రీన్ క్లైమేట్ టీం కార్యకర్తలు జనపరెడ్డి రవితేజ, ఇళ్ల కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మేము సైతం అధ్యక్షులుగా వెంకట్

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం రామవరం మేము సైతం సేవా సొసైటీ నూతన పాలకవర్గం ఎన్నికైంది. సొసైటీ అధ్యక్షులుగా ఎర్ర వెంకట్, ఉపాధ్యక్షులుగా అక్కిరెడ్డి పెంటయ్య, సెక్రటరీగా ఎం.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా జి.నాగరాజు, ట్రెజరర్‌గా జి.సత్యారావును సొసైటీ 45 మెంబర్స్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరి పదవీకాలం రెండేళ్లు ఉంటుంది. గతంలో అధ్యక్షులుగా పనిచేసిన జి.రమణ నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. రెండేళ్లలో జిల్లా స్థాయిలో సేవా కార్యక్రమాల్ని విస్తృత పరుస్తామని మేము సైతం సేవా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు దేవుడుబాబు అక్కిరెడ్డి తెలిపారు.

గాజువాకలో తీవ్ర కాలుష్యం : వార్వా



మాట్లాడుతున్న ఎన్ ప్రకాష్‌రావు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకలో కాలుష్య సమస్య తీవ్రంగా ఉందని వార్వా విశాఖ జిల్లా అధ్యక్షులు ఎన్.ప్రకాష్‌రావు అన్నారు. వార్వా, నివాస్ గాజువాక జోన్ కమిటీ సర్వసభ్య సమావేశం శనివారం గాజువాకలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గాజువాకలో కాలుష్యంతో పాటు, అదాని గంగవరం పోర్టు నుంచి భారీ వాహనాలు రాకపోకలు ఎక్కువగా సాగిస్తున్నాయని తెలిపారు. దీంతో 100 అడుగుల రోడ్డు వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందన్నారు. గాజువాకలో పందుల సమస్య కూడా తీవ్రంగా ఉందన్నారు. ఈ సమస్యలపై వార్వా, నివాస్ ఒక చార్ట్ ఏర్పాటుచేసి, ప్రజలను చైతన్యం చేసి కార్యక్రమాలు చేయాలని కోరారు. వార్వా, నివాస్ పోరాట ఫలితంగానే చెత్త పన్నుపై విజయం సాధించామన్నారు. భవిష్యత్తులో చెత్త పన్నుపై నాలుగు రెట్లు చార్జీలు, మంచినీటి ప్రైవేటుపరం పేరుతో 10 రెట్లు నీటి చార్జీలు పెరిగే అవకాశం ఉందని, దీనిపై పోరాటం చేయాల్సివస్తుందని చెప్పారు. పార్కుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గతంలో పోరాటం చేశామని తెలిపారు.

తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, అత్యధిక ఆదాయం గాజువాక నుంచి జివిఎంసికి వస్తుంటే అభివృద్ధి అంతా నగరంలోనే చేస్తున్నారని తెలిపారు. గాజువాకలో అభివృద్ధి లేదన్నారు. సుందరీకరణ అంతా నగరానికే పరిమితమైందన్నారు. వార్వా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ చౌదరి సంఘం మూడేళ్ల చేసిన కార్యక్రమాల నివేదికను వివరించారు. ప్రధానంగా రోడ్లు, కాలువలు, మంచినీరు, విద్యుత్ దీపాలు, పారిశుధ్యంపై చేపట్టిన కార్యక్రమాలను, జోనల్ కమిషనర్లకు, కమిషనర్‌కు ఇచ్చిన వినతి పత్రాలను చదివి వినిపించారు. చెత్త, ఆస్తి పన్నుపై పోరాటాలు, మొత్తం 18 అంశాలను సందర్భంగా నివేదిక రూపంలో తెలియజేశారు.

నూతన కార్యవర్గ ఎన్నిక

సర్వసభ్య సమావేశంలో వార్వా నివాస్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా డాక్టర్ రమేష్ కుమార్, అధ్యక్షులుగా బి.వి.త్రినాథ్‌స్వామి, ఉపాధ్యక్షులుగా పి.లక్ష్మణస్వామి, వై.సత్యవతి, ఎస్‌వికె.పరశురాం, పి.రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె.కిరీటంతోపాటు ఆఫీస్ బేరర్లను కమిటీ మెంబర్లు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.రమేష్‌కుమార్, కె.కిరీటం, బి.గుర్రప్ప, ఎస్‌వికె.పరశురాం, ఎం.వెంకటేశ్వరరావు, పివివి.రమణారావు, కె.సంతోషం, నివాస్ సభ్యులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్

ప్రజాశక్తి -ములగాడ : ఐక్య పోరాటాలతోనే పెన్షనర్ల సమస్యలను పరిష్కరించుకోగలమని పెన్షనర్ల సంఘం మల్కాపురం జోన్ నాయకులు నూకరాజు చెప్పారు. పారిశ్రామిక ప్రాంత ఎపిఆర్‌పిఎ ప్రాంతీయ సమావేశం శనివారం మల్కాపురం సిఐటియు ఆఫీసులో నిర్వహించారు. సిహెచ్.తమ్మారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూకరాజు మాట్లాడుతూ, ఢిల్లీ ధర్నా కార్యక్రమానికి విశాఖ జిల్లా నుంచి 33 మంది వెళ్లినట్లు తెలిపారు. ఈ ధర్నాకు వెళ్లిన వారికి విరాళాలు ఇచ్చిన సభ్యులకు సంఘం తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఢిల్లీలో జరుగుతున్న ధర్నాకు మద్దతుగా జివిఎంసి సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద 8వ తేదీన నిరసన తెలిపామని, 60 మంది హాజరయ్యారని తెలిపారు. సభ్యులు నిరుత్సాహ పడకుండా పోరాటాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.హుస్సేన్ మాట్లాడుతూ, జులై 15వ తేదీన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసి ఈపీఎఫ్- 95 పెన్షనర్లకు రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. 21వ తేదీన విశాఖ ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రం ఇచ్చి పార్లమెంట్‌లో ఈపీఎఫ్ 95 పెన్షనర్ల సమస్యను ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేయాలని కోరామని తెలిపారు. ఢిల్లీలో జరిగిన మూడు రోజులు ధర్నా గురించి వివరిస్తూ మొదటి రోజు ధర్నాకు సంఘీభావం ప్రకటిస్తూ తమిళనాడు డిఎంకె ఎంపీ షణ్ముఖం, కేరళ సిపిఎం ఎంపీ జాన్ బ్రిటాస్, ఎపి నుంచి తెలుగుదేశం పార్టీ ఎంపీ అప్పలనాయుడు, తెలంగాణ నుంచి నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి హాజరయ్యారని వివరించారు. రెండో రోజు ధర్నాను పోలీసులు అడ్డుకున్నప్పటికీ ఎపిఆర్‌పిఎ సభ్యులందరూ అక్కడే ఉండి మైకు లేకుండానే సమావేశాన్ని నిర్వహించినట్లు చెప్పారు. మూడో రోజు సెంట్రల్ ఈపీఎఫ్ కమిషనర్‌ను కలవడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేకపోవడంతో అసిస్టెంట్ కమిషనర్‌ను కలిసి హయ్యర్ పెన్షన్ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. రాహుల్ గాంధీని కలిసి సమస్యను పరిష్కరించే దిశగా కృషిచేయాలని కోరే ప్రయత్నంలో మన నాయకులు ఉన్నారని వివరించారు. భవిష్యత్తులో జరిగే కార్యక్రమాలలో సభ్యులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చోరీ స్థలాన్ని పరిశీలించిన సిపి

ప్రజాశక్తి -మధురవాడ : పనోరమ హిల్స్‌లో చోరీ జరిగిన ఇంటిని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శనివారం పరిశీలించారు. క్రైమ్ విభాగం అధికారులతో కలిసి ఘటనా స్థలానికి వెళ్లారు. చోరీ జరిగిన చుట్టుపక్కల వారితో మాట్లాడారు. అనంతరం సీపీ మాట్లాడుతూ చోరీ జరిగిన తీరును, చుట్టుప్రక్కల ప్రాంతాలను నిశితంగా పరిశీలించామని చెప్పారు. చోరీ చేసిన వ్యక్తులను గుర్తించి తక్షణం అరెస్టు చేయాలని పోలీసులను ఆదేశించారు. కాలనీల వాసులు సీసీటీవీ కెమెరాల ఏర్పాటుతో పాటు ఫుటేజ్ 30 రోజుల వరకూ భద్రంగా ఉంచుకోవాలని, పరిసర ప్రాంతాలలో దట్టమైన పొదలను తొలగించాలని సూచించారు. కాలనీలో లైటింగ్ మరింత పెంచేలా, సెక్యూరిటీ 24/7 ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. నివాసితులు దూరప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఇంటి భద్రత కోసం పోలీసు శాఖ కల్పిస్తున్న ఎల్‌హెచ్‌ఎంఎస్ వినియోగించు కోవాలని సూచించారు.

కేరళకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి -మధురవాడ : కేరళ వయనాడ్‌లో విపత్తుతో ప్రాణాలు కోల్పోయి, నిరాశ్రయులైన వారి కుటుంబ సభ్యుల సహాయార్థం మాలతాంబ విద్యానికేతన్ ఆధ్వర్యాన శనివారం విరాళాలు సేకరించారు. కారుషెడ్ నుంచి పిఎం.పాలెం చివరి బస్ స్టాప్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించి సహాయ నిధి సేకరించారు. సేకరించిన విరాళాలను మాలతాంబ విద్యానికేతన్ సిఇఒ, ఎన్ఐఎఫ్ఎస్ విద్యాసంస్థల అధినేత డీడీ ద్వారా కేరళ సిఎం రిలీఫ్ ఫండ్‌కు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఐఆర్.కృష్ణ, ప్రిన్సిపల్ ఎ.ఆదిమూర్తి, వైస్-ప్రిన్సిపల్ బి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ పరీక్షల్లో విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి -తగరపువలస : డాక్టర్ ఎన్‌టిఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఫిజియోథెరపీ రెండో ఏడాది పరీక్షా ఫలితాల్లో స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ ఫిజియోథెరపీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సునీల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరైన 15 మంది విద్యార్థినుల్లో నలుగురు డిస్టింక్షన్‌లోను, తొమ్మిది మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. విశ్వ విద్యాలయం స్థాయిలో ఎం.అనురాధ, ఝాన్సీ రాణి వరుసగా ప్రథమ, ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. వీరందరినీ కళాశాలలో డీన్ డాక్టర్ పివి సుధాకర్ అభినందించి పుస్తకాలు అందజేశారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై తహశీల్దార్ దృష్టి



సీజ్ చేసిన వాహనాలతో తహశీల్దార్, పోలీసులు

ప్రజాశక్తి-పెందుర్తి : మండలంలోని ఎస్ఆర్.పురం, నరవ ప్రాంతంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలపై పలుమార్లు స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాధుడే కరువయ్యారు. ఎస్ఆర్.పురం గ్రామంలో ఎంపిపి భర్త మైనింగ్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోకపోవడంతో స్థానికులు కూడా మైనింగ్‌లపై ఫిర్యాదు చేయడమే మానేశారు. ఇటీవల తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన వేణుగోపాల్ తన దృష్టికి వచ్చిన ఆక్రమణలను వదలడం లేదు. మండలంలో టీములుగా ఏర్పాటుచేసి ఆక్రమాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. అక్రమ మైనింగ్‌ను కూడా వదిలేదు అని తహశీల్దార్ చెప్పడంతో కొంతమంది ఫిర్యాదులు చేయడానికి ముందుకొచ్చారు. ఎస్ఆర్.పురంలో శనివారం తెల్లవారుజామున గ్రావెల్ తరలిస్తారని ఫిర్యాదులు రావడంతో విఆర్‌ఒ, పోలీస్ సిబ్బంది సహకారం తీసుకొని ఎస్ఆర్.పురంలో రెండు లారీలను, ఒక జెసిబిని తహశీల్దార్ సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ, అక్రమ తవ్వకాలు, ప్రభుత్వ భూములను కబ్జాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫిర్యాదారులు నేరుగా తన వాట్సాప్ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి- అనకాపల్లి

ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ 'సీఐటీయూ' ఆధ్వర్యంలో గత ప్రభుత్వ కాలంలో 42 రోజుల పాటు చేసిన చేసిన సుదీర్ఘ సమ్మెకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో మద్దతు తెలియజేసి జీతాలు పెంపు, గ్రాట్యూటీ అమలుకు కృషి చేస్తానని ఇచ్చిన హామీలను అమలు చేయాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.దుర్గారాణి, మజ్జి నాగ శేషు మాట్లాడుతూ కనీస వేతనం అమలు, ఉద్యోగ భద్రత, గ్రాట్యూటీ కోసం సమ్మె చేయగా, నాటి ప్రభుత్వం ఎన్నో నిర్బంధాలు పెట్టిందని తెలిపారు. అయినా అంగన్వాడీలు తట్టుకోని నిలబడ్డారని, కొన్ని డిమాండ్లు వరిష్కరించుకున్నారని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే ఆ డిమాండ్లను పరిష్కరిస్తామని నారా లోకేష్ సమ్మె శిబిరంలో ప్రకటించారని గుర్తు చేశారు. సమ్మె కాలంలో పోరాటానికి మద్దతు తెలిపిన తెలుగుదేశం పార్టీ నేడు అధికారంలోకి వచ్చిందని, తక్షణమే వేతనాలు పెంచాలని గ్రాట్యూటీ అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం 42 రోజుల సమ్మె, అనుభవాలపై యూనియన్ ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని అందరూ చదవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కాసులమ్మ, వివి రమణమ్మ, జయలక్ష్మి, తనూజ, అంజలి, భ్రమరాంబ, సిఐటియు జిల్లా అధ్యక్షులు అర్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



సమ్మె అనుభవాలపై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అంగన్వాడీ నేతలు



జాతీయ జెండాలతో రత్నాకర్, కళాశాల అధ్యాపక సిబ్బంది

ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగరాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 15న ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగురవేయాలని డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ కోరారు. స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో హర్ ఘర్ తిరంగా అనే కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ విద్యార్థులను, స్టాఫ్‌ను ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగరెయ్యాలని కోరారు. జెండాతో సెల్ఫీ తీసుకొని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమం లో అన్ని బ్రాంచ్‌ల విభాగాధిపతులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండలంలోని ఎల్.సింగవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వేపాడ మధు, బాలకృష్ణపై దాడి చేసిన కొండెంపూడికి చెందిన వైసిపి కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మధు, బాలకృష్ణపై వైసిపి కార్యకర్తలు హత్యాప్రయత్నం చేశారని ఆరోపించారు. ప్రకటన విడుదల చేసిన వారిలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు మరిసా నాని, ఎంపిటీసీల ఫోరం అధ్యక్షులు దేవర అప్పారావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, టిడిపి కూటమి నాయకులు డొంకిన అప్పలనాయుడు, తమరాన దాసు, దాడి సూరి నాగేశ్వరరావు, దొండ సన్యాసిరావు, దొండ నరేష్, శరకన బాబురావు, దొడ్డి కిషోర్, సత్తిబాబు, దొండ శ్రీను ఉన్నారు.

అబద్ధపు ప్రచారాలు మానుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, వైసిపి ఎంపీ విజయసాయిరెడ్డి ఎక్కడికి వెళ్ళినా రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని అదే పనిగా అబద్ధ ప్రచారాలు చేస్తున్నారని, వాటిని వెంటనే మానుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగ జగదీష్ హితవుపలికారు. 2019కి ముందు చెప్పిన విధంగా ఇప్పుడు చెబితే ప్రజలు నమ్మరన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ లేదని, హత్యలు జరిగిపోతున్నాయని గగ్గోలు పెట్టడం శోచనీయమన్నారు. విజయసాయిరెడ్డి రాజ్యసభలో రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవని రాష్ట్రపతి పాలన విధించాలని కోరడం దుర్మార్గమన్నారు. తెలంగాణ రాష్ట్రం నుండి విద్యుత్ బకాయిలు 7500 కోట్లు వసూలు చేయలేకపోతున్నారని వారు మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించిన రీతిలో ఉన్నాయన్నారు. 2019 నుండి 24 వరకు రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వమే ఉందని, కెసిఆర్ దగ్గర నుండి ఒక్క రూపాయి వసూలు చేయలేదని గుర్తు చేశారు.

అక్రమ గ్రావెల్ తరలిస్తున్న లారీ సీజ్

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని జీవీఎంసీ 88వ వార్డు గంగవరం రెవెన్యూ పరిధిలో అక్రమంగా నిల్వచేసిన గ్రావెల్‌ను శనివారం తరలిస్తుండగా సంధ్యానగర్ గేటు వద్ద లారీని సీజ్ చేసినట్టు మైనింగ్ రాయల్టీ అధికారి స్వాతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో తాను రోడ్డుపై లారీని సంధ్యా నగర్ గేటు వద్ద పట్టుకొని సీజ్ చేసి కుర్మన్నపాలెం పోలీస్ స్టేషన్‌కి తరలించామని తెలిపారు.

ఏఐటియుసి జాతీయ సమావేశాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -అనకాపల్లి : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ గురజాడ కళాక్షేత్రంలో సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో జరుగుతున్న ఏఐటియుసి జాతీయ సమితి సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు బూసి వెంకటరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పెంటకోట సత్యనారాయణ, రాజాన దొరబాబు పిలుపునిచ్చారు. ఏఐటియుసి జాతీయ సమావేశాల గోడపత్రికను శనివారం వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలని, నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, అసంఘటిత కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తదితర అంశాలపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వై ఎన్ భద్రం, ఎం అప్పలరాజు, కే త్రినాథ్, ఆర్ అప్పలరాజు, వీరాచారి, పోతురాజు, నరాలశెట్టి సత్యనారాయణ, రమణ పాల్గొన్నారు.

'మదర్' సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న చొక్కాకుల వెంకటరావు

ప్రజాశక్తి-సబ్బవరం

మదర్ చారిటబుల్ ట్రస్ట్ అందించే సేవలు అభినందనీయమని లక్ష్మీ ఎంటర్ప్రైజెస్ అధినేత చొక్కాకుల వెంకటరావు అన్నారు. మండల కేంద్రంలో మదర్ చారిటబుల్ ట్రస్ట్ 10వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో పాల్గొన్న చొక్కాకుల మాట్లాడుతూ డాక్టర్ వేదూరి సత్య గంగరాజు పుట్టుకతో అవిటివాడైనా, ప్రభుత్వ ఉద్యోగాన్ని కూడా విడిచి, తన తల్లి జ్ఞాపకార్థం ట్రస్టును స్థాపించి తనకు ఉన్న కొద్దిపాటి ఆస్తిని సేవలు వినియోగించడం విశేషమన్నారు. కరోనా కష్టకాలంలో సుమారు 45 రోజులపాటు పేదలకు, లారీ డ్రైవర్లకు రోజుకు 200 మంది చొప్పున అన్నదానం చేశారన్నారు. ట్రస్ట్‌కు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. వార్షికోత్సవం సందర్భంగా ట్రస్ట్‌కు రూ.20 వేలు అందజేశారు. సబ్బవరం సర్పంచ్ దేడ్డం ప్రసాదరావు భవన నిర్మాణానికి 50 బస్తాల సిమెంట్ తన వంతు సహాయంగా అందిస్తానని హామీ ఇచ్చారు. టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి బర్నికాన సాయినాథరావు ట్రస్ట్‌కు తన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అనంతరం పేదలకు బియ్యం పంపిణీ చేశారు. టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దనిమిరెడ్డి శ్రీనివాసరావు, దేడ్డం పద్మావతి, ట్రస్ట్ సభ్యులు కృష్ణ, కార్తీక్, విలియం కేరి, కృష్ణవేణి, రజిత, మౌనిక, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ పునరుద్ధరించరూ..

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

వరి పంట వేయడానికి సమయం దాటుతుందని, వ్యవసాయ పంపు సెట్లకు సంబంధించిన స్తంభాలకు తెగిపోయిన విద్యుత్ వైర్లను పునరుద్ధరించి కరెంట్ సరఫరా చేయాలని మండలంలోని దిబ్బిడి గ్రామానికి చెందిన రైతులు కోరుతున్నారు. ఈ మేరకు శనివారం బాధిత రైతులు విలేకర్ల వద్ద తమ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని వంక చెరువు కింద 10 వ్యవసాయ బోర్లకు వెళ్లే విద్యుత్ లైన్లపై ఉన్న చెట్లును 10 రోజులు క్రితం విద్యుత్ శాఖ సిబ్బంది తొలగించారు. ఆ సమయంలో చెట్టు విద్యుత్ వైర్లపై పడడంతో వైర్లు తెగిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నాటి నుండి ఆ వైర్లను పునరుద్ధరించలేదు. ప్రస్తుతం వరి నాట్లు వేయడానికి రైతులు సిద్ధమయ్యారు. అయితే వర్షాలు కురవకపోవడంతో నీరు లేక, విద్యుత్ సరఫరా లేక బోర్లు పని చేయక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ వైర్లను పునరుద్ధరించి విద్యుత్ సరఫరా చేయాలని మొర పెట్టుకున్నా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు వైర్లను పునరుద్ధరించి తక్షణమే విద్యుత్ సరఫరా చేయాలని దిబ్బిడి గ్రామానికి చెందిన సుతపల్లి సర్వేశ్వరరావు, ఆకుల ఈశ్వరరావు, ఆకుల మాణిక్యం, జి.శ్రీనివాసరావు, గొంపా నాయుడు, గొంపా అప్పలనాయుడు తదితర రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై వడ్డాది విద్యుత్ సబ్ స్టేషన్ ఎఇని ప్రజాశక్తి ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.



విద్యుత్ వైర్లు తెగిపోవడంతో వేలాడుతున్న దృశ్యం

పింఛన్లు మంజూరు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం వితంతు, వృద్ధాప్య, వికలాంగులకు గత 8 నెలల నుంచి నూతన పెన్షన్లు ఇవ్వలేదని, అర్హులైన వారందరికీ వెంటనే పెన్షన్లు ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన వృద్ధులు, వికలాంగులు అనేకమంది ఉన్నారని వారందరికీ పెన్షన్ లేకపోవడం వల్ల తినడానికి తిండి లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన పెన్షన్‌లను కొనసాగిస్తూ నూతనంగా కొత్తవారికి ఇవ్వాలన్నారు. వికలాంగులకు స్లాట్ బుక్ అవ్వక పోవడం వల్ల వికలాంగ ధ్రువీకరణ పత్రాలు లేక ఎక్కువ మంది అర్హులు పెన్షన్ పొందలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ప్రత్యేక మెడికల్ క్యాంపులు ద్వారా వికలాంగు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.

ఆలయ ద్వారబంధ పూజ

ప్రజాశక్తి-మునగపాక : మునగపాకలో రూ.4 కోట్లతో నిర్మాణం జరుగుతున్న శ్రీవెంకటేశ్వర గణపతి రామాలయం ప్రధాన ద్వారాలకు ద్వారబంధం నిలుపు పూజ శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పలు గ్రామాల నుండి భక్తులు వచ్చారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయి కృష్ణ, జనసేన పార్టీ ఉత్తరాంధ్ర ముఖ్య ప్రతినిధి సుందరపు సతీష్ కుమార్ తదితరులు ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేశారు.

శిథిలమైన రైల్వేస్టేషన్ రోడ్డుపై నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి

పట్టణంలోని రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి భీమునిగుమ్మం మీదగా రైల్వే స్టేషన్ వెళ్లే రోడ్డు శిథిలమైన వాహనదారులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక నేతలు శనివారం రోడ్డును పరిశీలించి మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రం అయి, గ్రేటర్ విశాఖ పరిధిలో ఉండి కూడా రైల్వే స్టేషన్‌కి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండడం దారుణమన్నారు. వర్షం పడితే ఏదిరోడ్డో, ఏది గొయ్యో తెలియని పరిస్థితిలో వాహనదారులు స్కిడ్ అయి పడిపోతున్నారని తెలిపారు. నిత్యం రద్దీగా ఉన్న ఈ రోడ్డును అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదినా రైల్వే స్టేషన్ రోడ్డుని మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, బండి అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు, బొబ్బిలి గోవిందరాజులు, రావి దేవుళ్ళు, నాగేశ్వరరావుచౌదరి, సాయిబాబు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నేతలు



షార్ట్ సర్క్యూట్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతులు చేస్తున్న దృశ్యం

పేలిన ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి పట్టణం జివిఎంసి 81వ వార్డు కప్పువీధిలో కరెంటు స్తంభం ఎస్ఎస్ -557 ట్రాన్స్‌ఫార్మర్ సడన్‌గా షార్ట్ సర్క్యూట్ గురై పెద్ద శబ్ధంతో పేలడంతో ఆ ప్రాంతంలోని ఇళ్లలో ఏసీలు, టీవీలు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో స్థానికులు టిడిపి నాయకులు మల్ల సురేంద్రకి సమాచారం అందించారు. ఆయన వెంటనే అక్కడికి చేరుకొని కరెంట్ అధికారులతో మాట్లాడారు. దీంతో విద్యుత్‌శాఖ సిబ్బంది వచ్చి తాత్కాలిక మరమ్మతులు చేశారు. అయితే గతంలో కూడా ఈ ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు ఇటువంటి ఇబ్బందులే ఎదురయ్యాయని స్థానికులు తెలిపారు. ఇంటికి ఏసి వేయించుకున్న సమయంలో కరెంట్ అధికారులకు డిపాజిట్ కూడా కట్టామని, ఇప్పుడు ఈ పరిస్థితి వల్ల తాము ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ ఇటువంటివి పునరావృతం కాకుండా అధికారులు బాధ్యత తీసుకొని శాశ్వత పరిష్కారం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ ఈ సమస్యను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణకు తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నంద్యాల అప్పారావు, పెదరెడ్ల రమేష్, బాబి, అమ్మిగోలు శ్రీను, దార్ల శ్రీనివాస్, చంటి, బడా బాబు, ఎండకుర్తి అప్పలరాజు, నంద్యాల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న 72 ఎద్దుల పట్టివేత

ప్రజాశక్తి - యలమంచిలి : కంటైనర్‌లో అక్రమంగా తరలిస్తున్న 72 ఎద్దుల్ని యలమంచిలి టౌన్ పోలీసులు శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో పట్టుకున్నారు. వాటిని స్వాధీనం చేసుకొని గోశాలకు తరలించినట్లు టౌన్ పోలీసులు పేర్కొన్నారు. ఈ అక్రమ తరలింపులో ఎంహెచ్ 43 వై 5950 నెంబరు గల కంటైనర్ సీజ్ చేసినట్లు చెప్పారు. ఈ కంటైనర్ విజయనగరం జిల్లా మానాపురం నుండి కేరళలోని పాలక్కాడ్ తరలిస్తున్నట్టు నిందితులు చెప్పారని పోలీసులు తెలిపారు. ఎద్దుల్ని అక్రమంగా తరలిస్తున్న కేరళ వయనాడ్‌కు చెందిన షిజు, కొట్టాయంకు చెందిన విష్ణు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం దేవవరం గ్రామానికి చెందిన చొప్పా నూకరాజును అరెస్టు చేశారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ పోలీసులు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎస్సీ వర్గీకరణను ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకుంటామని, రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని అనకాపల్లి జిల్లా అంబేద్కర్స్ ఇండియన్ మిషన్ నాయకులు పాల్తేటి పెంటారావు అన్నారు. మిషన్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక జిల్లా స్థాయి ప్రతినిధుల సభ శనివారం స్థానిక కార్మిక కర్షక నిలయంలో జరిగింది. జిల్లా అధ్యక్షుడు కే దేవుడు అధ్యక్షతన జరిగిన ఈ సభలో పాల్తేటి పెంటారావు, జిల్లా జోనల్ ఇన్చార్జి టిటి అప్పారావు మాట్లాడుతూ పీవీ సుకుమార్ నాయకత్వంలో వర్గీకరణ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. 'వర్గీకరణ అంతం- మాల పంతం" అనే నినాదంతో ముందు నడుస్తామని చెప్పారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ గొంది అప్పారావు, విశాఖ జిల్లా ప్రెసిడెంట్ బోగేష్, కన్వీనర్ శివ, కో కన్వీనర్లు ప్రకాష్, శేఖరు, రెల్లి శ్రీను, నూకేష్, పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న అంబేద్కర్స్ ఇండియన్ మిషన్ నాయకులు

సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యలు

- మండల పరిషత్తు సమావేశానికి పలు శాఖల అధికారుల డుమ్మాపై సభ్యుల ఆగ్రహం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్న ఎంపిపి సూరిబాబు

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలో పలు సమస్యలు సంవత్సరాల తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదని పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపిపి గొర్లె సూరిబాబు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి 12 శాఖల అధికారులు హాజరు కాలేదు. ముఖ్యమైన శాఖల అధికారులు గైర్హాజరుపై ఎంపీపీ గొర్లి సూరిబాబు, సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపిపి సూరిబాబు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున సమావేశంలో ప్రధాన సమస్యలను మాత్రమే చర్చించారు. ముందుగా తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి నాగ జగదీశ్వరి పిహెచ్‌సి పరిధిలో చేపడుతున్న వైద్య సేవలు, వ్యాక్సిన్లు గురించి వివరించారు. తమ గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పనులకు సంబంధించిన సమస్యలను సంవత్సరాలుగా పరిష్కరించలేదని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాస్ సమాధానం ఇచ్చారు. తుమ్మపాల ఎంపీటీసీ సభ్యులు పంచదార్ల కన్నారావు, వెంకుపాలెం సర్పంచు రాపేటి నాగేశ్వరరావు, బౌలువాడ ఎంపీటీసీ సభ్యులు తోటాడ విజయ్ తదితరులు విద్యుత్ సమస్యలపై ఆర్ఇసిఎస్ ఏఈని ప్రశ్నించారు. అధికారులు సమేశానికి రాకపోతే తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని పిసినికాడ ఎంపీటీసీ మొల్లేటి హైమ, మార్టూరు ఎంపీటీసీ రామచంద్రరావు, గొలగాం ఎంపీటీసీ ముమ్మిన, తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు ప్రశ్నించారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకునేందుకు కలెక్టర్ దృష్టికి తేవాలని సమావేశం తీర్మానించింది. సుమారు గంట పాటు జరిగిన కార్యక్రమంలో 23 మంది ఎంపీటీసీ సభ్యులు, ఏడుగురు సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి సూరిబాబు తదితరులు

ప్రభుత్వ భూములు చేతులు మారడంపై విచారణ

చోడవరం ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి-వడ్డాది

వైసిపి ప్రభుత్వ హయాంలో డి.ఫారం భూములు చేతులు మారడంపై విచారణ జరిపిస్తామని చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు తెలిపారు. బుచ్చయ్యపేట మండలం ఎల్.సింగవరం గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ శాసనసభ్యులు ధర్మశ్రీ, వైసిపికి చెందిన కొంతమంది నేతలు కలిసి డి.ఫారం భూములను ప్రైవేటు భూములుగా నమ్మించి బయట వ్యక్తులకు అమ్మకాలు జరిపి కోట్లాది రూపాయలు చేతులు మార్చుకున్నారని ఆరోపించారు. అవి ప్రభుత్వ భూములని నేడు తెలియడంతో కొనుక్కున్న వ్యక్తులు లబోదిబోమంటున్నారని తెలిపారు. ఈ కుంభకోణంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి, విచారణ జరిపించి చేతులు మారిన భూములను త్వరలోనే స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. ఈ భూ కుంభకోణంలో అధికారులు కూడా ఉన్నారని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎల్.సింగవరం గ్రామంలో ప్రభుత్వ భూమిని వైసిపికి చెందిన వ్యక్తులు కబ్జా చేశారనే కారణంతో స్థానిక సర్పంచి మధు శుక్రవారం తన అనుచరులతో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి అడిగారని, దీంతో సర్పంచ్‌పైనా, కార్యకర్తలపైనా విచక్షణ రహితంగా మారణాయుధాలతో దాడి చేసి హత్యాయత్నం చేశారని ఆరోపించారు. దాడి చేసిన వారిని గుర్తించి శిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు మరిసా నాని, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు దేవర అప్పారావు, టిడిపి మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, కూటమి నాయకులు డొంకిన అప్పలనాయుడు, తమరాన దాసు, దాడి సూరి నాగేశ్వరరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ పాల్గొన్నారు.

శిథిలావస్థలో రక్షిత మంచినీటి ట్యాంక్

ఆందోళన చెందుతున్న ఇరువాడ ఎస్సీ, బీసీ కాలనీ వాసులు

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని ఇరువాడ పంచాయతీ పరిధి ఇరువాడ ఎస్సీ, బీసీ కాలనీలో రక్షిత మంచినీటి సరఫరా ట్యాంక్ శిధిలావస్థకు చేరుకుంది. అది ఏ సమయంలోనైన కూలిపోయే ప్రమాదం ఉందని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వాటర్ ట్యాంక్‌ను 2000వ సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి నిధులు మంజూరు చేసి నిర్మించడం జరిగింది. సుమారు 200 కుటుంబాలు ఈ రక్షిత మంచినీటి ట్యాంక్ నీటిని తాగుతూ ఎస్సి, బీసీ కాలనీ వాసులు జీవిస్తున్నారు. ప్రస్తుతం ఈ వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు పడిపోతుందోనని ఆందోళనలో కాలనీ వాసులు ఉన్నారు. దీంతో మంచినీటి సరఫరా ఆగిపోవడమే కాక చాలా ప్రమాదమైన పరిస్థితులకు దారి తీసే అవకాశం ఉందని, ఆస్తి నష్టం, ప్రాణం నష్టం కూడా వాటిల్లే పరిస్థితులు ఉన్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సమస్యను స్థానిక నేతలు, అధికారులు, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తారని, వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకు ఇదే..

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండల కేంద్రం కె.కోటపాడుకు చెందిన పలువురు యువకులు శనివారం జనసేన పార్టీలో చేరారు. పార్టీ మాడుగుల నియోజకవర్గ ఇన్చార్జి రాయపురెడ్డి కృష్ణ సమక్షంలో గోపి నాగేశ్వరరావు, జి రాజేష్, దొడ్డి మహేష్, వేగి ప్రకాష్, గౌరు నాయుడు తదితరులు జనసేనలో చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అంజిబాబు, త్రినాథ్, అచ్యుతరావు, అప్పలనాయుడు, రాజీ నారాయణమూర్తి, వేగి శివాజీ పాల్గొన్నారు.

పంచాయతీలకు పంద్రాగస్టు నిధులు పెంపుపై హర్షం

ప్రజాశక్తి-కె.కోటపాడు

పంచాయతీల్లో స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహణకు ప్రభుత్వం నిధులు పెంచడంపై ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీ చాంబర్ అధ్యక్షులు, చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. 34 ఏళ్లుగా మేజర్ పంచాయతీలకు రూ.250, మైనర్ పంచాయతీలకు రూ.100 పంద్రాగస్టు నిర్వహణ ఖర్చులు ప్రభుత్వం ఇచ్చేదని, ఇప్పుడు మేజర్ పంచాయతీలకు రూ.25,000, మైనర్ పంచాయతీలకు రూ.10వేలుకు పెంచినట్లు తెలిపారు. ఇటీవల పవన్ కళ్యాణ్‌ను సర్పంచులు కలిసిన సందర్భంలో నిధులు కొరత వల్ల స్వాతంత్ర్య వేడుకలు, గణతంత్ర వేడుకలు చేయడం కష్టంగా ఉందని చెప్పిన మేరకు నిధుల పెంపు నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ నిధులతో పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం, పారిశుధ్య కార్మికులను సత్కరించడం చేయొచ్చని తెలిపారు.

చోడవరం : స్వాతంత్ర్య దినోత్సవానికి మైనర్ పంచాయతీలకు రూ.వేలు, మేజర్ పంచాయతీలకు రూ.25వేలు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కేటాయించడం పట్ల జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ పీవీఎస్ఎన్.రాజు శనివారం ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలన్న సంకల్పంతో గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతున్న గాంధీజీ ఆశయాలకు అనుకూలంగా పవన్ కళ్యాణ్ పాలనను సాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలోనూ జనసేన కార్యకర్తలు, నాయకులు స్వాతంత్ర దినోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో స్వర్ణ పతకం

ప్రజాశక్తి-అనకాపల్లి : 41వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జూనియర్ టైక్వాండో చాంపియన్ షిప్ -2024 పోటీల్లో అనకాపల్లికి చెందిన షేక్ వహీదా పూమ్సే విభాగంలో బంగారు పతకం కైవసం చేసుకుంది. విజయనగరంలోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో షేక్ వహీదా బంగారు పతకంతో పాటు, కేయోగి 49 కేజీల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారులు మహారాష్ట్రలో ఔరంగాబాద్లో ఈనెల 17 నుంచి 20 వరకు జరిగే జాతీయస్థాయి టైక్వాండో పోటీల్లో పాల్గొంటారని కోచ్ సిహెచ్ చంద్రశేఖర్ తెలిపారు.



విజేతతో కోచ్ తదితరులు

కారిడార్ నిర్వాసితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు భూసేకరణ చట్ట ప్రకారం అన్ని విధాల ఆదుకోవాలని, నిర్వాసితులకు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసిన తర్వాతే పనులు ప్రారంభించాలని నాయకులు, నిర్వాసితులు డిమాండ్ చేశారు. చందనాడ తుఫాన్ భవనంలో శనివారం కారిడార్ నిర్వాసితులు తమ సమస్యలపై చర్చించుకునేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైసిపి నేత వీసం రామకృష్ణ, ఏపీ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, చందనాడ ఎంపిటిసీ సభ్యులు గంటా తిరుపతిరావు, గ్రామ సర్పంచ్ భర్త తళ్ళ భార్గవ్, సిఐటియు మండల కన్వీనర్ ఎం.రాజేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ భూసేకరణ సందర్భంగా అధికారులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇల్లు కోల్పోతున్న వారిలో 18 సంవత్సరాలు నిండిన వారికి 25 లక్షలు, భూసేకరణ సందర్భంగా ఉపాధి కోల్పోతున్న నిర్వాసితులలో 18 సంవత్సరాలు నిండిన వారికి 15 లక్షలు చెల్లించాలని తెలిపారు. ఈ గ్రామాలలో నివశిస్తున్న అన్ని సామాజిక తరగతులు వారికి ప్యాకేజీ ఇవ్వాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతీ నిర్వాసితునికి ప్యాకేజీ వర్తింపజేయాలని కోరారు. అదేవిధంగా గ్రామాల వారీగా నిర్వాసితులు పెట్టుకున్న దరఖాస్తులను సర్వేలు చేసి ఆ సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. చందనాడ దళితుల గుల్లబట్టీలు, డీ ఫారం భూములకు నష్టపరహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జిరాయితీ భూములతో సమానంగా డీ ఫారం, సాగు భూములకు నష్టపరహారం చెల్లించాలని కోరారు. మత్స్యకారులకు జీవనోపాధికి ఫిషింగ్ జెట్టీ నిర్మించాలని, మత్స్యకారుల సొసైటీ భూములకు నష్టపరహారం చెల్లించాలన్నారు. అధికారులకు భూములను స్వాధీనం చేసుకోవడంలో ఉన్న శ్రద్ధ,


మాట్లాడుతున్న నాయకులు

ఆత్రుత నిర్వాసితులను ఆదుకోవడంలో చూపకపోవడం చాలా అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎం.రాజేష్, జీ.గోవింద్, పి.రమణ, వై.రమణ. పి.వెంకట రమణ, వై.మన్నియ్య, పి.సువర్ణ రాజు, పి.వీరన్న, వి.కృష్ణ, ఆర్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ, సిబ్బంది

గంజాయి, నాటు సారాలపై గట్టి నిఘా

ప్రజాశక్తి- మాడుగుల: గంజాయి, నాటు సారాలపై గట్టి నిఘా పెట్టామని ఎస్ఐ దామోదర్ నాయుడు తెలిపారు. శనివారం మండల లీగల్ సర్వీసెస్ ఆథారిటి ఆధ్వర్యంలో మాడుగుల, జి.గదబురు గ్రామంలో గంజాయి, నాటుసారా నిర్మూలన పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్సై దామోదర్ నాయుడు, స్థానిక న్యాయవాది శ్రీనాదు ప్రసాదరావులు మాట్లాడుతూ, గంజాయి, నాటుసారా ఆరోగ్యానికి మంచిది కాదన్నారు. ప్రజలు ఈ రెండిటికి దూరంగా ఉండాలని చెప్పారు. వైద్యులు ప్రసాద్ పాత్రుడు, లీలా ప్రసాద్ వైద్య సేవలు అందించారు. ఈ కారక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్సై, న్యాయవాదులు ఎల్లరావు, కృష్ణ, ప్రమోద్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


రోడ్డు పక్కన చెత్తా చెదారం

బయలుపూడిలో అపారిశుధ్యం

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - చీడికాడ:గ్రామం మధ్యలో చెత్తా చెదారం తో పారిశుధ్యం లోపిస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని బయలుపూడి గ్రామం మధ్యలో ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం దగ్గరలో ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారాలతో పెరిగి పోయాయని తెలిపారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలకు చెత్తాచెదారంతో దోమలు, ఈగలు బాగా పెరిగి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రం చేయాలని గ్రామస్తులు కోరారు.

గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరాలు

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని కోనాం గిరిజన గ్రామంలో ఏజెఎఫ్ సీఎం బి.సూర్య కళ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గిరిజనులకు, పేదలకు వైద్య చికిత్సలు నిర్వహించి అవసరమగు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నారాయణరావు, ఏఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తకోట:చోడవరం సివిల్ జడ్జి బి.సూర్యకళ ఆధ్వర్యంలో కొత్త కోట ఎస్సై లక్ష్మణరావు సహకారంతో చీమలపాడు పంచాయతీ గిరిజన గ్రామాలైన కళ్యాణపులోవ, జెడ్.జోగుంపేట గ్రామాలలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసారు. ఈ శిబిరానికి రెండు గ్రామాల నుంచి సుమారు 152 మంది రోగులు హాజరయ్యారు. వచ్చిన రోగులకు కొత్తకోట పిహెచ్‌సి వైద్యులు సురేఖ వినయ్, చేతన, రజని, వికాస్, దినేష్ తదితరులు



కొత్తకోటో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు, హెచ్‌యస్ రమణ, హెచ్. వి.ఎర్రమ్మ, వైద్యసిబ్బంది జోషిణి, స్వరూపా, లక్ష్మి, అనిత, వరలక్ష్మి, మౌనిక, రామలక్ష్మి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణపై నిరసన

ప్రజాశక్తి -కొత్తకోట:ఎస్సి వర్గీకరణ పై సుప్రీంకోర్టు పున:ఆలోచన చేయాలని కోరుతూ రావికమతం మండలం కొత్తకోటలో బిఆర్ అంబేద్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. స్థానిక బియన్ రోడ్డులో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు మల్లేటి రాజు, బి.బుల్లిబాబు, పూడి దేవ, అప్పారావు, కాగిత గంగరాజు, బి.నాగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం అంటూ గతంలో సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పు ఇచ్చిందన్నారు. ఏబిసిడి వర్గీకరణతో 16 ఉప కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మూడు రోడ్డు కూడలిలో మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పూడి అర్జున్, మరువాడ అర్జునరావు, టి.శేఖర్, పూతి అప్పారావు, బి.చిరంజీవి పాల్గొన్నారు.


నిరసన చేపడుతున్న నాయుకలు, గ్రామస్తులు


నివాళులర్పిస్తున్న విశాఖ డెయిరీ ఉద్యోగులు

రమణకు ఘన నివాళి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చందనాడ గ్రామంలో విశాఖ డెయిరీ మాజీ వేతన కార్యదర్శి పుణ్యమంతుల రమణ 4 వ వర్ధంతిని ఆయన కుటుంబ సభ్యులు, విశాఖ డెయిరీ ఉద్యోగులు, స్నేహితుల శనివారం ఘనంగా నిర్వహించారు. పాల సొసైటీ కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణ సేవలను కొనియాడారు. అనంతరం మహిళా పాడి రైతులకు చీరలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ తుని యూనిట్ మేనేజర్ ఎం శ్రీను, సూపర్వైజర్ కిరణ్, వేతన కార్యదర్శి పుణ్యమంతుల బాబ్జి, గ్రామ పెద్దలు తళ్ళ అప్పలస్వామి, పెదకాపు అప్పలరాజు, బిపిఎం నారాయణరావు, వేతన కార్యదర్శులు బొల్లం విష్ణు, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న క్రీడాకారులు

హాకీ క్రీడాకారుల సంబరాలు

ప్రజాశక్తి- నక్కపల్లి:పారిస్ ఓలింపిక్స్‌లో జరిగిన హాకీ టోర్నమెంట్‌లో భారత్ హాకీ జట్టు కాంస్య పతకం సాధించడంతో నక్కపల్లిలో బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ క్రీడాకారులు శనివారం సంబరాలు చేసుకున్నారు. ముందుగా హాకీ క్రీడాకారులంతా జాతీయ జెండాలు చేతబట్టి జై భారత్ అంటూ నినాదాలు చేస్తూ, విజయం సాధించిన క్రీడాకారులకు అభినందనలు తెలియజేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం క్రీడా మైదానంలో కేక్ కట్ చేసి సందడి చేశారు. ఒకరికొకరు స్వీట్లు పంచుకున్నారు. హాకీ క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, అధ్యక్షులు చిన్న అప్పారావు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ, కోచ్ రాంబాబు, సీనియర్ జాతీయ క్రీడాకారుడు గాజుల రామచంద్రరావు, రజిత్, నానాజీ తదితరులు విజయం సాధించిన టీం ఇండియా హాకీ క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు .

అంబేద్కర్ స్మృతి వనం ధ్వంసంపై నిరసనలు


విశాఖలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపడుతున్న కెకె రాజు

ప్రజాశక్తి- పద్మనాభం : అంబేద్కర్ స్మృతి వనంలో ధ్వంసాన్ని నిరసిస్తూ మండలంలోని పద్మనాభం జంక్షన్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద వైసిపి ఆధ్వర్యాన శనివారం నిరసన తెలిపారు. ఎంపిపి కె.రాంబాబు, దళిత సంఘం మండల అధ్యక్షులు ఈశ్వరరావు ఆధ్వర్యాన అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.

సీతమ్మధార : జివిఎంసి 55వ వార్డు పరిధి ధర్మానగర్ హైవేపై అంబేద్కర్ విగ్రహం వద్ద ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు ఆధ్వర్యాన కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కెకె రాజు మాట్లాడుతూ, అంబేద్కర్ స్మృతివనంపై దాడి చేయడమంటే దేశ ప్రజలను అవమానించటమేనన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, బర్కత్ అలీ, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్ పాల్గొన్నారు.

గొలుగొండ:విజయవాడలో జరిగిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ మహా శిల్ప స్మృతి వనంపై దాడిని ఖండిస్తూ గొలుగొండ మండలం ఏఎల్.పురం మేజర్ పంచయతీలో వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బిఆర్ అంబేద్కర్ ఖ్యాతినిగత ప్రభుత్వం హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రపంచానికి చాటి చెప్పాలని, విజయవాడ నడిబొడ్డులో నిర్మించిన మహా శిల్ప స్మృతి వనంపై దాడి చేయడం సరికాదన్నారు. ఇది హేయమైన చర్యగా భావిస్తూ తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సామాజిక వర్గ వైసీపీ కార్యకర్తలు, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న నాయకులు, మహిళలు



పుస్తకాలు పంపిణీ చేస్తున్న కళ్యాణ్‌రావు

అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

ప్రజాశక్తి-కొత్తకోట:అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని విశాఖపట్నం అంబేద్కర్ భవన్ ఛైర్మన్ బొడ్డు కళ్యాణ్‌రావు తెలిపారు. రావికమతం మండలం కేంద్రంలో సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో శనివారం విద్యార్థినిలకు చోడవరం అంబేద్కర్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ ఛైర్మన్, రిటైర్డ్ సివిల్ జడ్జ్ నడుపురి సన్యాసిరావు ఆర్థిక సాయంతో సమకూర్చిన పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకొని మంచి అభివృద్ధిలోకి రావాలన్నారు. ఉన్నతమైన స్థానాలల్లో ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్క ర్ ట్రస్ట్ నిర్వాహకులు కండెల్లి వెంకట్రావు, భూపతి రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

వర్షంతో రైతన్నల హర్షం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని శనివారం సాయంత్రం కొద్దిసేపు భారీ వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం ఒక్కసారిగా జోరున వర్షం కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి. పొలాల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. దీంతో, రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలా చోట్ల వరి నాట్లు పడ్డాయి. వర్షాలు లేకపోవడంతో ఇంకా చాలా చోట్ల వరి నాట్లు నిలిచి పోయాయి.రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్న సమయంలో కురవడంతో మిగిలిన చోట్ల వరి నాట్లు వేసేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారు.

ఎఐటియుసి జాతీయ సమావేశాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సెప్టెంబర్ 1, 2, 3 తేదీలలో విశాఖపట్నంలో జరగనున్న ఎఐటియుసి జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు, జాతీయ ఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ, జిల్లా గౌరవాధ్యక్షులు బిసిహెచ్.మసేన్ విజ్ఞప్తి చేశారు. శనివారం నగరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి పారిశ్రామిక కేంద్రంగా ఉన్న విశాఖపట్నంలో జరిగే సంఘం జాతీయ సమితి సమావేశాలకు ఉక్కునగరంలోని గురజాడ కళాక్షేత్రం వేదిక కానుందన్నారు. 3వ తేదీన విశాఖ నగరంలో వేలాది మందితో కార్మిక ప్రదర్శన సరస్వతి పార్కు నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వరకూ జరుగుతుందని తెలిపారు. అనంతరం బహిరంగ సభ ఉంటుందన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.మన్మథరావు, ఉపాధ్యక్షులు ఎస్‌కె.రెహమాన్, జెడి.నాయుడు, కోశాధికారి కె.సత్యాంజనేయ పాల్గొన్నారు.

బొత్సను మర్యాదపూర్వకంగా కలిసిన వాసుపల్లి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర మాజీ విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణను దక్షిణ వైసిపి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం మేఘాలయ హోటల్లో జరిగిన ఓ కార్యక్రమానికి బొత్స హాజరుకాగా ఆయనకు వాసుపల్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

ఘనంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవం

-పలుచోట్ల పతాకావిష్కరణలు



నర్సీపట్నంలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) స్వర్ణోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి సిఐటియు కార్యాలయం వద్ద యుటిఎఫ్ జెండాను సంఘ గౌరవాధ్యక్షులు నెల్లి సుబ్బారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యను పేదలకు అందుబాటులో ఉంచాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో విద్యారంగం ఒక ప్రయోగశాలగా మారిందని వాపోయారు. ప్రభుత్వం మారుతున్న ప్రతిసారీ ప్రభుత్వ విద్యా విధానాలు మారిపోతున్నాయని తెలిపారు. విద్యా విధానంలో కామన్ సిలబస్ తేవాలని కోరారు. ప్రైవేట్ విద్యా రంగంలో ఫీజులు విపరీతంగా పెరిగాయని, దీంతో సామాన్యులకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారిందని పేర్కొన్నారు. యుటిఎఫ్ ఆవిర్భవించి యాభై సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా విద్యారంగంలో యుటిఎఫ్ చేసిన కృషిని, పోరాటాలను వివరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, కోశాధికారి జోగా రాజేష్, కార్యదర్శులు రమేష్ బాబు, శేషుబాబు, సీనియర్ నాయకులు ఎల్లయ్యబాబు, ఎంవీ అప్పారావు, రాజునాయుడు, సతీష్, శాంతి, కామరాజు, శ్రీను, సలీం, గేదెల శాంతి దేవి, శివప్రసాద్, అజయ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పి.గాయత్రి పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు చిట్టియ్య, సాంబమూర్తి, ప్రసాద్, సంతోష్ పాల్గొన్నారు.

విశాఖపట్నం : యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు సంఘం విశాఖ జిల్లా కార్యాలయంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.అప్పారావు అధ్యక్షతన ఘనంగా జరిగాయి. పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్.నాగమణి పతాకావిష్కరణ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ సంఘం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బి.జనార్ధన్, జిల్లా కోశాధికారి కె.రాంబాబు, జిల్లా కార్యదర్శులు రియాజ్ అహ్మద్, టి.జగన్, రామకృష్ణ పాల్గొన్నారు.



విశాఖలో పతాకాన్ని ఎగురవేస్తున్న నాయకులు

పెందుర్తి కూడలిలో జిల్లా కార్యదర్శి చుక్క సత్యం అధ్యక్షతన యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా సహాధ్యక్షులు రొంగలి ఉమాదేవి పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వంగా రామలక్ష్మి, మండల అధ్యక్షులు అప్పలరామ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధదేవ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మండల కేంద్రంలో పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం బుద్ధదేవ్ భట్టాచార్యకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.లోకనాథం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, 2000 నుంచి 2011 వరకు వరుసగా 11 సంవత్సరాలు పశ్చిమ బెంగాల్ సీఎంగా ఆయన సేవలందించారని కొనియాడారు. డివైఎఫ్ఐ నుండి ప్రజానాయకుడు ఎదిగారన్నారు. పశ్చిమ బెంగాల్‌లో ప్రజాతంత్ర ఉద్యమం అభివృద్ధికి సుదీర్ఘ కాలం సిపిఎం నాయకత్వంలో వామపక్ష ప్రభుత్వం సుదీర్ఘ కాలం నడవడానికి కృషి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.గౌరీ, కేవీ.సూర్యప్రభ, యుటిఎఫ్ నాయకులు గాయత్రి, ఎం.చిట్టయ్య, కేవీపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, ముఠా కార్మిక సంఘం నానాజీ, అంగనాడి యూనియన్ నాయకులు ఆర్.రమణమ్మ, పర్వీణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి.గీతాకృష్ణ, జ్ఞానేష్, తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న లోకనాథం, తదితరులు


చిరు వ్యాపారాలకు అనుమతి ఇవ్వాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 22వ వార్డు పిఠాపురం కాలనీ కళాభారతి రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పించాలని చిరు వర్తకులు శనివారం జివిఎంసి కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. చిరువర్తకుల తరుపున న్యాయవాది శ్రీరామమూర్తి మీడియాతో మాట్లా డుతూ 20, 30 ఏళ్లుగా ఇక్కడే తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకుంటూ సుమారు 335 కుటుంబాలు జీవనం సాగిస్తున్నా యన్నారు. జివిఎంసికి రూ.20 ఆశీలు రూపంలో ప్రతి తోపుడు బండి నుంచీ చెల్లిస్తున్నారని తెలిపారు. వార్డు కార్పొరేటర్ రూ.20 ఆశీలుకు బదులు రూ.40 తనకు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అందుకు ఒప్పుకోకపోవడంతోనే హైకోర్టులో పిల్ వేసి దుకాణాలు తొలగించాలని జివిఎంసి అధికారులతో ఒత్తిడి తీసుకొస్తు న్నారన్నారని తెలిపారు.

అసంపూర్తిగా కెజిబివి భవనాలు

మంజూరు కాని నిధులు - అవస్థలు పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల భవనాలు అసంపూర్తిగా నిలిచి పోయాయి. ఈ పాఠశాలలో సుమారు 240 మంది విద్యార్థులు ఆరవ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు చదువుతున్నారు. గతంలో నిర్మించిన భవనంలో 6 నుంచి 10 వరకు విద్యార్థులు చదువుకునే వారు, ఇంటర్ తరగతులు ప్రవేశపెట్టాలని ఉద్దేశంతో నాటి టిడిపి ప్రభుత్వం, హెూం స్వచ్ఛంద సంస్థ ద్వారా అదనపు తరగతి గదిలో ఏర్పాటు నిమిత్తం పనులు మొదలుపెట్టారు. తరగతి గదులు పూర్తి కానప్పటికీ అప్పట్లో కొత్తగా ఏర్పడిన వైసిపి ప్రభుత్వం 2019 నుండి ఇంటర్ తరగతులు ప్రవేశపెట్టగా సుమారు 51 మంది వరకు ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారు. హెూం స్వచ్ఛంద సంస్థ చేపట్టిన పనులను కొనసాగిస్తూ, నాడు నేడు నిధులతో అసంపూర్తిగా భవనాల నిర్మాణం ప్రారంభించినప్పటికీ నేటికీ అవి ప్రారంభానికి నోచుకోలేదు. ప్రభుత్వం నాడు నేడు నిధుల కింద 43,99,348 లక్షలు మంజూరు కాగా 22,11,538 నిధులు మాత్రమే విడుదలయ్యాయి, వీటితో కేవలం నాలుగు గదులు మాత్రమే పూర్తికాగా ఇంకా మూడు గదులు పూర్తి కావాల్సి ఉంది. పూర్తయిన గదులకు విద్యుత్ సౌకర్యం కల్పించాల్సి ఉంది.



నిధులు పూర్తిగా మంజూరు కాకపోవడంతో మరికొన్ని తరగతి గదులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు తరగతి గదిలోనే నిద్ర పోవాల్సిన పరిస్థితి నెల కొంటుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి అసంపూర్తి భవన నిర్మాణాలను పూర్తి చేయాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.



మధ్యలోనే నిలిచిన కెజిబివి భవనాలు